తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## ఏనుగుల నుండి పంట నష్టాల నివారణకై చర్యలు

### -ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పలమనేరు,ఏప్రిల్ 23,ప్రభాతవార్త: పలమనేరు నియోజకవర్గంలో ఏనుగుల నుండి పంట నష్టాల నివారణకై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. పలమనేరు మండలం ముసలమడుగులో కుంకీ ఏనుగుల నిర్వహణ ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముసలమడుగు వద్ద 10 రోజులలో కుంకీ ఏనుగులను తీసుకురావడం జరుగు తుందన్నారు. దీంతో ఓ వైపు పర్యటకంగాను మరో వైపు ఏనుగులు రైతుల పంటలపై దాడి చేయకుండా నివారించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఫ్.ఆర్.ఓ నారాయణ,టిడిపి నాయకులు,అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భాష్యకార్ల ఊరేగింపు

తిరుమల,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:



భాష్యకారుల ఉత్సవం బుధవారం ఉదయం వేడుకగా జరిగింది. మేనెల 2వతేదీ భాష్యకార్ల సాత్తు మొర నిర్వహిస్తారు. బుధవారం ఉదయం ఆలయంలో మొదటి గంట తరువాత శ్రీరామానుజుల విగ్రహాన్ని బంగారుతిరుచ్చిపై ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. జీయంగార్లు దివ్యప్రబంధ గోష్టి చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

### ఇంటికొక పారిశ్రామిక వేత్తను

## తయారు చేయాలన్నదే సీఎం ఆకాంక్ష

### -మంత్రి కొండపల్లి శ్రీనివాస్




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త ః
ఇంటికొక పారిశ్రామిక వేత్తను తయారు చేయాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు ఆకాంక్ష అని సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి శాఖా మంత్రి వర్యులు కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫెరెన్స్ హాల్‌లో ఎంఎస్ఎం ఈల పనితీరుపై జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈఓ విశ్వ మనోహర్, పరిశ్రమలకు కు సంబంధించిన గాజులమండ్యం అసోసియేషన్ నేతలతో సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కలిసి సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే లక్ష్యంగా ఉన్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అడుగు జాడల్లో నడుస్తూ ప్రతి ఇంటికి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడానికి ప్రతి ఒక్కరు సైనికులా పనిచేస్తామని మంత్రికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి చిత్తూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌లు విజయభరత్‌రెడ్డి, సుబ్బారావు, తిరుపతి చిత్తూరు జిల్లాల పరిశ్రమల శాఖ అధికారులు సుధాకర్, సూరిబాబు, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, జిల్లా అధికారులు, బ్యాంకు అసోసియేషన్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీసిటీని సందర్శించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సత్యవేడు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త: రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం శ్రీసిటీని సందర్శించారు. ఆయనకు సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ మేనేజింగ్‌డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రగతిని వివరించారు. శ్రీసిటీ పరిశ్రమల్లో మధ్య, చిన్న తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) శాతం ఎక్కువగా ఉందన్న ఆయన ఉపాధి కల్పన, ఆవిష్కరణలు, సరఫరా గొలుసుతో పాటు మంచి పర్యావరణ వ్యవస్థ దృష్టికి ఇది దోహదం చేస్తోందన్నారు. ఎంఎస్ఎంఈ కేటగిరిక చెందిన నూతన పరిశ్రమ గుప్తా ఆక్సిజన్ ప్రైవేటు లిమిటెడ్ శంకుస్థాపన కార్యక్రమంలో శ్రీసిటీ ఎండీతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఆ సంస్థ ఎండీ, సీఈవో ఆనంద్ గుప్తా వారికి స్వాగతం పలికారు. అనంతరం శ్రీసిటీ పరిసరాల్లో మంత్రి పర్యటించారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి శ్రీసిటీ ఒక మంచి నమూనాగా భాగంగా శ్రీసిటీలో పరిశ్రమల సీఈవోల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, ప్రిన్సిపల్ టెక్నికల్ అడ్వయిజర్ డా. ఎం.శ్రీనివాస శంకర్‌ప్రసాద్, గ్లోబల్ ఫోరమ్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ రాంనాథ్ వెలమాటి, సీనియర్‌అధికారులు మంత్రి పర్యటనలో పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో బాలికలదే పైచేయి

### - 79.83శాతం ఉత్తీర్ణతతో జిల్లాకు 19వ స్థానం - మే 19నుంచి 28వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

తిరుపతి విద్య ఏప్రిల్ 23 ప్రభాతవార్త
పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ఎప్పటిలానే ఈ ఏడాది 83.18శాతం ఉత్తీర్ణతతో బాలికలు పై చేయి సాధించారు.గత ఏడాది ఫలితాల్లో 90.71శాతం ఉత్తీర్ణతతో జిల్లా 10వ స్థానంలో నిలవగా ఈ ఏడాది 79.83శాతం ఉత్తీర్ణతతో 19వ స్థానానికి దిగజారింది.తిరుపతి జిల్లాలోని 34మండలాల పరిధిలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను మార్చి 17నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు 164పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పకడ్బందీగా నిర్వహించారు.ఈ పరీక్షలకు బాలురు 14,063మంది,బాలికలు 12,616మంది,మొత్తం 26,679మంది విద్యార్థులు హాజరయ్యారు.వీరిలో బాలురు 10,804 (76.83శాతం) మంది, బాలికలు 10,494(83.18శాతం) మంది, మొత్తం 21,298 (79.83శాతం)



మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.ఈ పరీక్షకు ఇంగ్లీష్ మీడియంలో 24,861మంది హాజరవ్వగా వారిలో 20,176 (81.16శాతం)మంది,తెలుగు మీడియంలో 1,728మందిలో 1,043 (63.36శాతం)మంది, తమిళం మీడియంలో 72మందిలో 61 (84.72శాతం) మంది, ఉర్దూ మీడియంలో 18మందికి 18(100శాతం)మంది ఉత్తీర్ణత సాధించారు.

### - ఉత్తమ మార్కులతో విజయఢంకా..



ఈ ఏడాది పది ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అత్యధిక మంది ఉత్తమ మార్కులు సాధించి విజయఢంకా మోగించారు. అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి 26,679 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 21,298మంది ఉత్తీర్ణత సాధించగా 5,381 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు.పాసైన వారిలో ఫస్ట్ క్లాస్‌లో 17,630మంది,సెకండ్ క్లాస్‌లో 2,546మంది,థర్డ్ క్లాస్‌లో 1,122మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు డీఈఓ కేవీఎన్.కుమార్ తెలిపారు.

## 24వ స్థానంలో నిలిచిన చిత్తూరు జిల్లా

### - ఫలితాల్లో 73.20 శాతం ఉత్తీర్ణతతో మెరిసిన బాలికలు

చిత్తూరుటౌన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:
రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదలైన టెన్త్ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో చిత్తూరు జిల్లా ఎత్తిపోయింది. చిత్తూరు జిల్లా రాష్ట్ర స్థాయిలో 67.06 శాతం ఉత్తీర్ణత సాధించి 24వ స్థానంలో నిలిచింది. టెన్త్ ఫలితాల్లో బాలికలు ఓ మెరుపు మెరిశారు. బాలికలు టెన్త్ ఫలితాల్లో 73.20 శాతం ఉత్తీర్ణత సాధించారు. టెన్త్ ఫలితాల్లో బాలురు మసకబారారు. బాలురు టెన్త్ ఫలితాల్లో 61.30 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. మార్చిలో జరిగిన టెన్త్ పరీక్షలకు చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 20,796 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా ఇందులో 13,946 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 10,073 మంది బాలికలు పరీక్షలకు హాజరు కాగా ఇందులో 7,373 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే 10,723 మంది బాలురు పరీక్షలకు హాజరు కాగా 6,573 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

**మే 19 నుండి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు**

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుండి 28వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఏప్రిల్ 24 నుండి ఏప్రిల్ 30వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించుకోవచ్చునన్నారు. అలాగే 50 రూపాయల అపరాధ రుసుంతో మే 1 నుండి 18వ తేదీలోపు సంబంధిత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుల లాగిన్ ద్వారా చెల్లించవచ్చునన్నారు. రీ-కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకునే వారు సబ్జెక్టుకు 500 రూపాయలు చెప్పున చెల్లించాల్సి వుంటుందని, అలాగే రీ-వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు సబ్జెక్టుకు వెయ్యి రూపాయలను చెల్లించాల్సి వుంటుందని, ఈ మొత్తంను ఏప్రిల్ 24వ తేదీ ఉదయం 10 గంటల నుండి మే 1వ తేదీ రాత్రి 11 గంటల వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాల్సి వుంటుందని డిఇఓ వరలక్ష్మీ తెలిపారు.

## కుప్పంలో ప్రయోగాత్మకంగా శునకాల నియంత్రణకు ఎబిసి కేంద్రం



కుప్పం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త
కుప్పం నియోజకవర్గంలో శునకాల నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం ఆదేశాలతో అనిమల్ బర్త్ కంట్రోల్ (ఎబిసి) కేంద్రాన్ని ఏర్పాటుచేస్తున్నారు. కుప్పం మున్సిపల్ పరిధిలోని పలార్లపల్లి వద్ద ఈ కేంద్రాన్ని త్వరలోనే అందుబాటులో తీసుకురానున్నారు. కుప్పం నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల పరిధిలో ఉన్న శునకాలను పట్టి ఈ ఎబిసి కేంద్రానికి తరలించిన అనంతరం వాటికి జనన నియంత్రణ టీకాలు వేయడంతో పాటు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఎఆర్‌వి )టీకాలను సైతం వేస్తారు. అలాగే అనారోగ్యంతో ఉన్న శునకాలను ఈ కేంద్రంలో ఉంచి స ంరక్షణ సైతం చేస్తారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో సుమారు 6వేల దాకా శునకాలను పశుసంవర్ధక శాఖ అధికారులు గుర్తించారు. శునకాలకు ప్రతి ఆర్నెల్లకు ఓసారి ఎఆర్‌వి టీకాలు వేయనున్నారు. ఈ విషయంగా కమీషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలోనే ఎబిసి కేంద్రం ప్రారంభానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పలార్లపల్లి వద్ద ఇదివరకు ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఎబిసి కేంద్రంగా మార్చే పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

## హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ విగ్రహ ఆవిష్కరణ



తిరుపతి క్రీడ,
ఏఫ్రిల్ 23, ప్రభాతవార్త
తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ బహకరించిన హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ విగ్రహాన్ని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరని శ్రీనివా సులు షాప్ చైర్మన్ ఏ రవి నాయుడు, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎల మంచిలి ప్రవీణ్ కార్యదర్శి శ్రీధర్, ఒలంపిక్ అసోసియేషన్, బాడీబిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి శివ ప్రసాద్, ట్రైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి విజయ్ కుమార్, రై ఫీల్ అసోసియేషన్ కార్యదర్శి, దేవరాజులు ,జిమ్నాస్టిక్ అసోసియేషన్ కార్యదర్శి హరి, జెన్ అసోసియేషన్ కార్యదర్శి కిరణ్, కరాటే అసోసియేషన్ కార్యదర్శి డి సి ఎస్ నాయుడు, ఫుట్బాల్ అసోసియేషన్ కార్యదర్శి మునయ్య, రెజ్లింగ్ కార్యదర్శి ఉదయ్ కుమార్ ,రోల్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ప్రేమ్ నాథ్ ,డిఎస్డివో సయ్యద్ వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు మరియు కోచ్‌లు పాల్గొన్నారు.

### అడిగిన చోట పోస్టింగ్ ఇస్తున్నా...!

## ఇష్టంగా విధులు నిర్వహించండి

### -కౌన్సిలింగ్‌తో భారీగా పోలీసుల బదిలీలు



తిరుపతి, ఏప్రిల్ 23ప్రభాతవార్త:
మీకు ఇచ్చిన అవకాశంలో మీరు అడిగిన చోట పోస్టింగ్ ఇచ్చానని....పోలీసుశాఖ ప్రతిష్టను పెంపొందించేలా విధులు నిర్వహించాలని తిరుపతి జిల్లా ఎస్పీ వి,హర్షవర్ధన్‌రాజు నిర్దేశం చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం ఒకేస్టేషన్‌లో నాలుగేళ్ళకుపైగా ఐదేళ్ళు పూర్తిచేసుకున్న మీరంతా మరోకొత్తస్టేషన్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎవరూ కూడా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా, అశ్రద్ధగా ఉండరాదని సూచించారు. పలు కారణాలతో ,వైద్యపరంగా ఇబ్బందులు ఉన్నవారు కూడా అడిగిన స్టేషన్‌కు పోస్టింగ్ ఇచ్చానన్నారు. ప్రజలతో మమేకమై ,వారితో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. స్టేషన్‌కు పలురకాల కారణాలతో,సమస్యలతో వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలు తెలుసుకోవాలన్నారు. పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలన్నారు. ప్రజలకు పోలీసులున్నారనే నమ్మకం కలిగించే పనితీరు ఉండాలన్నారు. మీరు కోరిన చోట ,ఇష్టమైన పోలీసుస్టేషన్‌కు పోస్టింగ్ ఇచ్చానని, మీనుండి ఆశించిన ఫలితాలు రావాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కోరారు. బుధవారం పోలీసుజిల్లా కార్యాలయంలో చిత్తూరు,నెల్లూరుజిల్లాల నుండి తిరుపతి జిల్లాలోకలసిన స్టేషన్‌లకు చెందిన వారు తొలిసారిగా కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. అదనపు ఎస్పీలు రవిమనోహరచారి. వెంకట్రావు, నాగభూషణం, ఐ.రామకృష్ణ,జిల్లాలోని డిఎస్పీలతో కలసి కౌన్సిలింగ్ విధానంలో 393మందికి ఎంచుకున్న స్టేషన్‌లకు బదిలీ చేశారు.

### రైతులకు నష్టపరిహారం అందించిన తరువాత

## భూముల్లో నుంచి తొలగించాలి

### - సబ్ కలెక్టర్‌కు రైతు సంఘం వినతి





గూడూరు, ఏఫ్రిల్ 23, ప్రభాతవార్త
గూడూరు నియోజకవర్గ పరిధిలోని కోట మండలం కొత్తపట్నం సంబంధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ,కులాల చెందిన పేదలు క్రిస్ సిటీ పేరుతో సాగు చేసుకొనుచున్న 90 ఎకరాలు వేరుశనగ పంటను జేసిబిలతో ధ్వంసం చేస్తున్నారని, అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేసినటువంటి వేరుశనగ పంట 20 రోజుల్లో చేతికి వస్తున్న పంటను క్రిస్ సిటీ పేరుతో జెసిబిలు పెట్టి ధ్వంసం చేస్తున్నారని సంబంధిత రైతులు 15 రోజులు కాల వ్యవధి ఇవ్వండి అని ప్రాధేయపడినా కనికరించకుండా దౌర్జన్యంగా ధ్వంసం చేయడం ఆపాలని బుధవారం గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం అధికారులు పెద్దల పక్షాన చేరి, పేదల భూములను ధ్వంసం చేయడం వలన సన్న, చిన్నకారు రైతులు వీధిన పడతారని, చేతికి వచ్చిన పంటకు కూడా నష్టపరిహారం ఇప్పించకుండా అధికారులు చేతివాటం ప్రదర్శిస్తూ, ప్రశ్నించిన రైతులపై కేసులు పెడతామని, బెదిరించడం సబబుగా లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు పంటలను ధ్వంసం చేయడం ఆపాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ను రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేయడం జరిగింది. వెంటనే సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా స్పందిస్తూ రైతు సంఘం నాయకులతో నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందజేస్తున్నాం. నేను ఆ ఏరియా కి వెళ్లి పంటను స్వయంగా పరిశీలించడం జరిగిందని అవసరమైన నంతవరకు రోడ్డుకి కావలసిన భూముల్లో ఉండే పంటను మాత్రమే తొలగించడం జరుగుతూ ఉందని, రైతులకు ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగదని, ఆయన హామీ ఇచ్చారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ నష్టపరిహారం అంటున్నారు పరిహారం నిజమైన సాగుదారులైన డి.కె.టీ. పట్టాదారులకు చెల్లించడం లేదని, డీ.కే.టి.పట్టాదారులకు కూడా చట్ట ప్రకారమే చెల్లించాలని, వెంటనే అందరికీ సమన్వయం జరిగేలా 2013 భూ సేకరణ చట్ట ప్రకారం అందరికీ పరిహారం అందించాలని వారు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు రైతు సంఘం నాయకులు జోగి. శివకుమార్, బి.వి.రమణయ్య పుట్టా శంకరయ్య, అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడులను నిరశిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

### తిరుపతిలో

తిరుపతి(రవాణ) ఏప్రిల్ 23ప్రభాతవార్త



వేసవిలో కాశ్మీర్‌లో అందాలను చూడటానికి వెళ్ళిన పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపి ప్రాణాలు తీయడం దారుణమని, ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని బిజెపి కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టింది. బుధవారం సాయంత్రం బిజెపి తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్,జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుండాల గోపీనాథరెడ్డి, బిజెపి యువజన విభాగం నేత జి.పృధ్వీ, బిజెపి నాయకులు దగ్గుబాటి శ్రీహరిరావు, మునిసుబ్రమణ్యం, సుబ్రమణ్యంరెడ్డి,చంద్రశేకర్, అజయ్‌కుమార్, కుమార్‌రెడ్డి తదితరులు భారీగా 27 మంది అమాయక హిందు పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని మౌనంగా ర్యాలీ చేశారు.

### కుప్పంలో

కుప్పం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదా డులను నిరశిస్తూ డిసిఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కుప్పంలో జన సేన కోఆర్డినేటర్ నరేష్ అధ్వర్యంలో కొవ్వొత్తు లతో ర్యాలీ నిర్వహించారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి ఎన్టీఆర్ విగ్రహం వద్ద మౌన దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం ప్రధాని మోడీ నేతృత్వంలో పాక్ ఉగ్రవాదులను పూర్తిగా అంతం చేస్తుందని పేర్కొన్నారు. ఉగ్రదాడిలో హతమైన వారికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నేతలు, వీర మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పుంగనూరులో



పుంగనూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త
అణువణువు రగిలిపోతున్నామని, తీవ్రవాదం అంతు చూసేంతవరకు వెన్ను తిరగమని నినదిస్తూ హిందూ సంఘాలు కాగడాలు చేతపట్టి కదం తొక్కారు. కాశ్మీర్ పహల్గాం సంఘటనకు నిరసనగా బుధవారం రాత్రి పట్టణంలో మండుతున్న కాగడాల నిర్వహించారు. హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ పిరికిపందలైన పాకిస్తాన్ తీవ్రవాదులు అమాయక ప్రజల ప్రాణాలను బలి కొనడం సిగ్గుచేటు అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను రెచ్చగొట్టడం కాదు నేరుగా రణ రంగానికి రావాలని పిలుపునిచ్చారు. హిందూ సంఘాల ర్యాలీతో భావావేశ పరిస్థితి ఏర్పడ్డాయి.

### శ్రీకాళహస్తిలో

.శ్రీకాళహస్తి, ఏఫ్రిల్ 23 ప్రభాతవార్త
జమ్ముకాశ్వీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని బిజెపి పూర్తిగా ఖండిస్తోందని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్‌కుమార్ అన్నారు. పట్టణంలో కాశ్మీర్ ఉగ్రవాద దాడులకు వ్యతిరేఖంగా బిజెపి నాయకులు నిరననలు చేపట్టారు. కోలా మట్లాడుతూ బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పర్యాటకులపై తీవ్రమైన దాడలు చేసి 28 మంది మృతులకు కారణమైన వారిని కఠినంగా బహిరంగంగా ఉరితీయాలన్నారు.పర్యాటకులపై దాడులుచేసిన కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో కోలా.ఆనంద్‌తోమేళాగారం సుబ్రమణ్యంరెడ్డి,పలురు బిజపిబిజెపి నాయకులు పాల్గొన్నారు.

## కుప్పంలో జనవిజ్ఞానవేదికచే పుస్తక ప్రదర్శన

కుప్పం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కుప్పంలోని జమీందారు పార్కులో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు వైఎస్ నాగేశ్వరరావు అధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా పలు ఆసక్తికర పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30వతేది వారోత్సవాల చివరి రోజు మరిన్ని పుస్తకాలను ప్రదర్శనకు అందుబాటులో తీసుకువస్తామన్నారు. పుస్తకాలు, గ్రంథాలు అనేవి జ్ఞానాన్ని పె ంపొందించే కీలకాంశాలు అన్నారు. కార్యక్రమంలో మాజీ టౌన్‌బ్యాంక్ ఛైర్మన్ పివి ఉపేంద్రకుమార్, న్యాయవాదులు కెవి ప్రసాద్, నరేంద్ర ఆజాద్, మాజీ సర్పంచ్ చీలేపల్లి శివశ ంకర్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతిపురం మండలంలో 57.45శాతం ఉత్తీర్ణత

శాంతిపురం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో శాంతిపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు 57.45శాతం మేర ఫలితాలు సాధించారు. 19పాఠశాలలకు చెందిన 705మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 405మంది పాసయ్యారు. 300మంది ఫెయిలయ్యారు. ఎపి మోడల్ స్కూల్‌కు చెందిన ఇందుజ 567మార్కులు, కెనమాకుపల్లి హైస్కూల్‌కు చెందిన గుణశ్రీ, రాళ్లబూదుగూరు హైస్కూల్‌కు చెందిన స్పందన 563 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. స్థానిక వివేకానంద పాఠశాలలో 17మందికి గాను 14మంది ఉత్తీర్ణులయ్యారు. భవ్య 574/600, షాహిస్తా అంజుమ్ 568మార్కులు సాధించారు.

## 35లీటర్ల నాటుసారా స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్

కుప్పం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



కుప్పం మండలం బిడి చేన్లు పరిసర ప్రాంతాల్లో జరిపిన ఎక్సైజ్ దాడుల్లో 35 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఇద్దర్ని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ నాగరాజ తెలిపారు. మరో వ్యక్తి పరారయ్యాడన్నారు. బిడిచేన్లుకు చెందిన తిరుపతి (62), వీర్నమలకు చెందిన గోవిందన్ (45)లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్‌కు ఆదేశించారన్నారు. అలాగే వీర్నమలకు చెందిన రాజే ంద్ర అనే వ్యక్తి పరారయ్యాడని అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు మోహన్‌బాబు, దిలీప్‌కుమార్, సిబ్బంది చలపతి ఆచారి, వెంకటేష్, రమేష్, కిరణ్, పద్మావతి పాల్గొన్నారు.

## పదవ తరగతిలో నారాయణ విద్యార్థుల ప్రతిభ

కుప్పంరూరల్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక నారాయణ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ తెలిపారు. మిథున్ కృతిక్ 591/600 మార్కులతో నియోజకవర్గ టాపర్‌గా నిలిచారన్నారు. అలాగే నిఖిత 587, భువన్ సాయి 586, స్వాతిక 585, మార్కులు సాధించారన్నారు. 21మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను డిజిఎం కొండలరావు, ఎపిఎం ఫణికుమార్ తదితరులు అభినందించారు.

## ఘనంగా చందం పాఠశాల వార్షికోత్సవం.. సరస్వతిపూజ

కుప్పంరూరల్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



మండలంలోని చందం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం, సరస్వతిపూజ కార్యక్రమాలను బుధ వారం ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ 2 రాజారాం, పిఎస్‌హెచ్‌ఎం సుబ్బరాంలు అతిథులుగా హాజరయ్యారు. వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదరం, ఎస్ఎంసి కమిటీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పెద్దపంజాణి మండలంలో 70.27శాతం ఉత్తీర్ణత.

పెద్దపంజాణి ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



పదోతరగతి పరీక్షఫలితాల్లో పెద్దపంజాణి మండలం 70.27శాతం ఉత్తీర్ణతసాధించింది. మండలంలో మెత్తం 656మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 461మంది ఉత్తీర్ణత సాధించారు 190మంది ఫెయిల్అయ్యారు. మండలంలో అత్యధికంగా రాయలపేట కెవిసిఆర్ జెడ్పీహైస్కూల్లో 151మంది విద్యార్థులకు గాను 99మంది విద్యార్థులు పరీక్షలో ఫెయిల్‌కావడం గమనార్హం. మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్లో 96మంది విద్యార్థులకు గాను 30మంది విద్యార్థులు ఫైయిల్ అయ్యారు. కాగా శంకర్రాయలపేటకు చెందిన సుమశ్రీ అనేవిద్యార్థిని 587మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. శంకర్రాయలపేటకే చెందిన గంగోత్రి 583మార్కులు, లేఖన 581 మార్కులు, హరిహరకుమార్ 581మార్కులు, ముత్తుకూరు చెందిన మైతిలి 580మార్కులతో నిలిచారు.

## 588 మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని

**పలమనేరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** 10వ తరగతి ఫలితాలలో పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థిని వి.భావన 600లకు 588 మార్కులు సాధించడం జరిగింది. పలమనేరు మండలంలో 1236 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయగా అందులో 866 మంది 70శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందిని పలమనేరు ఎఈఓ లీలారాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ పలమనేరు ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థిని వి.భావన 588 మార్కులు, కే.ప్రవళిక 585 మార్కులు, కొలమాసనపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని పి.చిత్ర 573 మార్కులు సాధించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఈఓ బాలసుందరం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్‌లో హిమజ విద్యార్థుల ప్రతిభ



పుత్తూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని హిమజ స్కూలు విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. మొత్తం 600 మార్కులకు గాను కె.శ్రావ్య 571 మార్కులతో ప్రథమ స్థానం సాధించారు. అలాగే ఎస్.భువనశ్రీ 570, సి.చరిష్మా 569 మార్కులు సాధించారు. మొత్తం 72 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా అందులో 28 మంది 500 మార్కులకు పైగా పొందారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థినులను అందుకు కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని బుధవారం విద్యాసంస్థల ఛైర్మన్ ఎం.సురేంద్రరాజు, కరస్పాండెంట్ ఎం.నిషిధరాజు, డైరక్టర్ ఎం.రేష్మ, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.తేజోవతి అభినందించారు.



## టెన్త్ మండల టాప్ హేమ

***బంగారుపాళ్యం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:*** టెన్త్ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో మండల టాపర్‌గా మంగళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎపి హేమ(592) మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మండల పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన 785 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా 435 మంది ఉత్తీర్ణత సాధించి 55 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో తమ్మిగానిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 10 శాతం, నల్లంగాడు 55 శాతం, మంగళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 62 శాతం, గుండ్లకట్టమంచి జడ్పీ ఉన్నత పాఠశాల 28 శాతం, బోడబండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల 50 శాతం, పిడివి కండ్రిగ 40 శాతం, మొగిలిమిట్టూరు జడ్పీ ఉన్నత పాఠశాల 52 శాతం, రాగిమానుపెంట జడ్పీ ఉన్నత పాఠశాల 35 శాతం, తుంబకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల 46 శాతం, టేకుమంద జడ్పీ ఉన్నత పాఠశాల 55 శాతం, బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 40 శాతం, గిరిజన సంక్షేమ పాఠశాల 40 శాతం ఆ మేరకు ఉత్తీర్ణత సాధించారు. అలాగే ప్రైవేటు పాఠశాలలైన విజేత 82 శాతం, సెయింట్ మేరీ 96 శాతం, విద్యార్థి 88 శాతం, రాయల్ పబ్లిక్ 70 శాతం, ఉషోదయ 83, సరోజిని 80 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఓ నాగేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంగళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎపి హేమ 592 మార్కులతో మండల టాపర్‌గా నిలవగా అదే పాఠశాలకు చెందిన కె.పునీత్‌సాయి 584, ఎస్.హేమ 584 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో విజేత పాఠశాలకు చెందిన ఎ.జాహ్నవి 587, ఉషోదయకు చెందిన ఎం.ప్రశాంతి 586, సెయింట్ మేరీకి చెందిన పి.కుసుమ 580 మార్కులు సాధించినట్లు ఎంఇఓ తెలిపారు.



## కిషోర్ రత్నం పాఠశాల ప్రభంజనం

***శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త*** శ్రీకాళహస్తిలో పది పరీక్షా ఫలితాల్లో డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాల విద్యార్థులు మార్కుల ప్రభంజనం కురిపించారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో శ్రీరామనగర్ కాలనీలోని పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటి పాఠశాల పేరు ప్రతిష్ఠలను ఇనుమడింపజేసారు. ఈ నేపధ్యంలో పదవ తరగతి పరీక్షలకు హాజరైన అందరూ విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు వివరించారు. ఈ పాఠశాల నుంచి హాజరైన విద్యార్థుల్లో ఎన్ సాయి శ్రీ 591 మార్కులతో పాఠశాలకు ఫస్ట్‌గా నిలిచింది. ఎస్ గురులక్ష్మణ్ 589 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు. ఎస్ సిరి చందన 588 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. పాఠశాల నూరు శాతం ఫలితాలు సాధించటంతో బుధవారం పాఠశాల డైరెక్టర్ కృష్ణకిషోర్, వాసంతి కిషోర్ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరిస్తూ అభినందించారు. ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, మేనేజర్ దైవాజ్ఞచారి ఉ పాధ్యాయులు ఉపాధ్యాయురాలు హాజరయ్యారు.

## టెన్త్ ఫలితాల్లో లిటిల్‌రోస్ ప్రభంజనం

చిత్తూరురూరల్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణం, ఇందిరానగర్‌లోని లిటిల్‌రోస్ గ్లోబల్ స్కూల్ ప్రభంజనం సృష్టించిందని కరస్పాండెంట్ డా.బి.గోపాలక్రిష్ణమూర్తి తెలిపారు. శేషాద్రి (580), యామిని( 560), పూర్ణిమ (548), సూర్య ప్రకాష్( 541), ఇషాంత్ (512), మోనిష (501) మార్కులు సాధించారని పేర్కొన్నారు. విద్యార్థిని విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్స్ డా.లోహిత్, రాధిక, అకడమిక్ ఇన్‌ఛార్జీ దుర్గశ్రీ, అధ్యాపకబృందం అభినందించారు.

## తెదేపా మహిళా నాయకురాలు మృతికి నివాళి

చిత్తూరురూరల్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంటరీ మహిళా కార్యదర్శి శ్రీదుర్గశ్రీ మృతికి తెలుగుదేశం పార్టీ ఘన నివాళులర్పించింది. బుధవారం ఎమ్మెల్యే గురజాల జగన్ తండ్రి గురజాల చెన్నకేశవనాయుడు, ఎమ్మెల్యే సతీమణి ప్రతిమగురజాల, తమ్ముడు గురజాల జీవన్‌లు సంతపేటలోని ఆమె నివాసానికి వెళ్లి మృతదేహానికి పార్టీ జెండా కప్పి నివాళుర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, తదితరులు వున్నారు.

## అమాయకులను చంపడం దారుణం

చిత్తూరురూరల్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:

కాశ్మీర్‌లో అమాయకులైన పర్యాటకులను చంపడం దారుణమని, ఉగ్రవాదుల పిరికిపంద చర్య అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి వాటిని ఉపేక్షించరాదని, ఈ విషాదం మాటల కందనిదనీ, భారతీయులందరూ కలసికట్టుగా నినాదాన్ని బలంగా ఇవ్వాలన్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ త్వరగా బాధిత కుటుంబాలు త్వరగా కోలుకోవాలని దేవున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## తీవ్రవాదులు పిరికిపందలు

పుంగనూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త



పాకిస్తాన్ తీవ్రవాదులు పిరికిపందలని, ధైర్యం ఉంటే ప్రత్యక్ష పోరాటానికి రావాలని విశ్రాంత డిఎస్పీ మాజీ సైనికులు సుకుమార్ బాబు పిలుపునిచ్చారు. శ్రీనగర్‌లో పహల్గం జరిగిన ఉగ్రవాద దాడిలో మరణించిన వారికి సంతాప సభ నిర్వహించారు. మాట్లాడుతూ త్వరలోనే మన మిలిటరీ వారిపై తగిన ప్రతీకారం తీసుకుంటుందని ఒక మాజీ సైనికునిగా ఒక విశ్రాంత పోలీస్ డిఎస్పీగా తను చాలా బాధపడుతున్నానని వ్యాఖ్యానించారు.

## తవణంపల్లె మండలంలో 80.94 శాతం ఉత్తీర్ణత

తవణంపల్లె, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో తవణంపల్లె మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు 80.94 శాతం ఉత్తీర్ణత సాధించించారు. బుధవారం విడుదల చేసిన ఎస్ఎస్‌సీ పరీక్షా ఫలితాల్లో మండలంలోని ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రయివేటు పాఠశాలల్లో సరాసరి 80.94 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మండలంలో గత నెలలో జరిగిన పదవ తరగతి పరీక్షలకు మొత్తం ఆరు ప్రభుత్వ, రెండు ప్రయివేటు పాఠశాలలకు సంభందించి 362 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 293 మంది ఉత్తీర్ణులయ్యారు. 69 మంది విద్యార్థులు అనుత్తీర్ణులయ్యారు. ఈమేరకు తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 84 మంది విద్యార్థులకు గాను 72 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, అరగొండ బాలురోన్నత పాఠశాలలో 47 మందికి గాను 27 మంది ఉత్తీర్ణులు కాగా అరగొండ బాలికోన్నత పాఠశాలలో 44 మందికి 38 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే తొడతర ఉన్నత పాఠశాలలో 46 మందికి 26 మంది ఉత్తీర్ణులు కాగాకృష్ణాపురం జడ్పీ హైస్కూల్‌లో 16 మందికి 11 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈమేరకు అరగొండ బాలికోన్నత పాఠశాలలో అత్యధికంగా 86.16 శాతం ఉత్తీర్ణత సాధించగా తొడతర జడ్పీ హైస్కూల్‌లో అతితక్కువగా 56.52 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఇదిలా వుండగా మండలంలోని శ్రీవినాయక విద్యామందిర్ 97.5 శాతం, అపోలో ఈషా విద్యాలయం 97.14 శాతంతో అత్యుత్తమ ఫలితాలను నమోదు చేసింది. అలాగే శ్రీవినాయక విద్యామందిర్‌కు పాఠశాలకు చెందిన పూర్ణిష 587 మార్కులతో మండలంలో మొదటిస్థానం సాధించగా ప్రజ్ఞారెడ్డి 585 మార్కులతో ద్వితీయస్థానం సాధించారు. మండలంలోని అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల శ్రీవినాయక విద్యామందిర్ కరస్పాండెంట్ ఆర్.గణపతినాయుడు హర్షం వ్యక్తం చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

## మాజీ ఎంపిపి వీరయ్య చౌదరి హత్య దారుణం

– ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



ఒంగోలు జిల్లా సంతనూతల పాడు నియోజకవర్గ మాజీ ఎంపిపి, టిడిపి నేత వీరయ్య చౌదరి హత్య దారుణమని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఒంగోలులో తన కార్యాలయంలో ఉన్న వీరయ్య చౌదరిని అత్యంత కిరాతకంగా నరికి చంపడం దారుణమన్నారు. వీరయ్య చౌదరి మృతదేహానికి ఆయన ఘన నివాళులు అర్పించి చౌదరి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. కుటుంబీకులకు ధైర్యం చెప్పారు.

## టెన్త్ ఫలితాల్లో కుప్పం పబ్లిక్ స్కూల్ విజయకేతనం



**కుప్పం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో కుప్పం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ మార్కులతో కుప్పం పట్టణ టాపర్లుగా నిలిచినట్లు స్కూల్ ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్, సిఇఒ సాగర్‌రాజ్ తెలిపారు. కిరణ్‌కుమార్ 586/600, అక్షర 580, రుచిత 579మార్కులు సాధించారన్నా రు. 550కు పైన మార్కులను 18మంది సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్, సిఇఒ సాగర్‌రాజ్, హెచ్ఎం దమయంతి, ప్రియ తదితరులు అభినందించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్‌లో 56శాతం ఉత్తీర్ణత

కుప్పం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో కుప్పం మండలంలోని 27 ప్రభుత్వ పాఠశాలలు 56శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ మహబూబ్ బాషా తెలిపారు. మండలంలో మొత్తం 1355మంది పరీక్షలు రాయగా 765మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. గరిగచీనేపల్లి హైస్కూల్‌లో చదువుతున్న శ్రావణి, వెన్నెల అనే విద్యార్థినులు 586మార్కులతో మండలంలో టాపర్లుగా నిలిచారు. అడవిబూదుగూరు హైస్కూల్‌కు చెందిన హారిక 584మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. కుప్పం బాలుర హైస్కూల్‌లో 124మంది లో 91మంది అత్యధికంగా ఫెయిల్ అయ్యారు. కుప్పం బాలికల హైస్కూల్‌లో 133మందికి గాను 52మంది ఫెయిల్ అయ్యారు.

## టెన్త్ ఫలితాల్లో బాలికల ప్రతిభ

**రామకుప్పం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో రామకుప్పం మండలంలో బాలికలు ప్రతిభ చూపారు. స్థానిక బాలికల హైస్కూల్‌కు చెందిన సబీహా సదాఫ్ 571మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. అలాగే చెల్దిగానిపల్లికి చెందిన అనుశ్రీ 570మార్కులు సాధించింది. విద్యార్థులను దేశం నేతలు అభినందించారు. కార్యక్రమంలో మునస్వామి, పత్ర నారాయణ, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజనేయరెడ్డి, చిన్నికృష్ణ, చలపతి, ఎస్ఎంసి ఛైర్మన్లు కేశవరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాల్లో వి.కోట వెనుకంజ

**వి.కోట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో వి.కోట మండలం వెనుకబడింది. స్థానిక బాలికల హైస్కూల్‌లో 124మందికి 65మంది మా త్రమే పాసయ్యారు. అలాగే బాలుర హైస్కూల్‌లో 109మందికి గాను 34మంది మాత్రం పాసయ్యారు. మండలంలో 1088మందికి గాను 626మంది మాత్రమే పాసయ్యారు.

## మండల స్థాయిలో ఉత్తీర్ణత సాధించిన పి.కొత్తకోట విద్యార్థిని



***పూతలపట్టు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త*** మండలంలో పి.కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 43 మంది విద్యార్థులకు గాను 39 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అందులో పూతలపట్టు మండలంలో ఉన్న అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పి. కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్. దినీషా పూతలపట్టు మండలానికి మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధించిందని పి.కొత్తకోట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపి తెలిపారు. తమ పాఠశాలలో 91 విద్యార్థులకు సాధించాలని అందులో 70 శాతం మంది విద్యార్థులు 500 పైగా మార్కులు తెచ్చారని తెలియపరిచారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిన విజయం వెనుక ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల కృషి ఎంతైనా ఉందని తెలియపరిచారు.

## టెన్త్ ఫలితాల్లో 73 శాతం ఉత్తీర్ణత

**యాదమరి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ పరీక్షా ఫలితాల్లో 73 శాతం ఉత్తీర్ణత సాధించింది. పాఠశాలకు చెందిన పల్లవి టెన్త్ పరీక్షా ఫలితాల్లో అత్యధికంగా 561 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలవగా, మరో 14 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించి పాఠశాలను మరింత ఉన్నత స్థానంకు తీసుకెళ్ళారు. పాఠశాల నుండి టెన్త్ పరీక్షలకు మొత్తం 143 మంది విద్యార్థులు హాజరైతే అందులో 104 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని పాఠశాల హెడ్మాస్టర్ గిరిరాజా, కమిటీ ఛైర్మన్ రేవతి, ఉపాధ్యాయులు అభినందించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి



సదం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని సదుం మండల జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మాధవి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరిగిందిి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సదుము తాసిల్దార్ మరియు విఆర్వోలు ఏసీబీకి చిక్కడం వారి అవినీతికి నిదర్శనం అన్నారు. రైతులను వేధించడం తగ్గించుకోవాలన్నారు. తప్పు పడిన రికార్డులు సరి చేయమని అడగడం వాళ్ళు డబ్బులు డిమాండ్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అదేవిధంగా అధికారులు అవినీతికి పాల్పడకుండా ప్రజలకు సేవ చేయాలన్నారు. ఈ సందర్భంగా తిమ్మానాయన పల్లె సర్పంచ్ మురళి రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామం మీదుగా ఆర్టీసీ బస్సు నడపమని మూడు సంవత్సరాలుగా అడుగుతున్న అధికారులు పట్టించుకోలేదన్నారు. పాలమందలో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మామిడికాయలు మొత్తం రాలిపోయాయని రైతులను ఆదుకోవాలని సర్పంచ్ శ్రీనివాసరెడ్డి కోరారు. అక్కడక్కడ వీధి దీపాలు వెలగడం లేదని కొన్నిచోట్ల రాత్రి పగలు కూడా వెలుగుతున్నాయని వీటిని సరిచేసుకోవాలని సోమశేఖర్ రెడ్డి కోరారు. అడవి అధికారి మహేష్ మాట్లాడుతూ వర్షాకాలం వస్తుందని ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కావలసినవారికి ఉచితంగా మొక్కలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చెరుకూరపల్లి పీహెచ్సీ సిబ్బంది హాజరైన వారందరికీ ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు అమరావతి పుట్రాజు మండల కో ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, ఎంపీడీవో హరిబాబు, ఆరోగ్యపర్యవేక్షకులు నీలకంఠ, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## కఠిన వైఖరి అవలంబించండి

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



జమ్మూకాశ్మీర్‌లో జరిపిన కాల్పులు జరిపిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ ద రెసిస్టెన్స్ ఫోర్స్‌ను తుదముట్టించాలని రాష్ట్ర బిజెపి మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు అయూబ్ ఖాన్ విజ్ఞప్తి చేశారు. కాశ్మీర్ పహల్గంలో 25 మంది పర్యాటకులు మరణించడం అత్యంత శోచనీయమని పలు సంస్థలు బుధవారం ఉదయం నివాళులర్పించాయి. మరణించిన వారికి సంతాపం తెలిపారు. ఈ దాడికి మేమే బాధ్యత అని పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ ద రెసిస్టెన్స్ ఫోర్స్ ప్రకటించడం, ఉగ్రవాదులు ఆర్మీ దుస్తుల్లో వచ్చి హిందువులని గుర్తించి మరీ చుట్టుముట్టి కాల్పులు జరిపి హతమార్చడం దారుణమైన అంశమన్నారు. కార్యక్రమంలో బి నరసింహులు, అయూబ్ ఖాన్ కృష్ణమూర్తి, నానాబాల కుమార్, నాగరాజా, అమర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉరుసు ఉత్సవాలకు ఏర్పాట్లు

పుంగనూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త

పట్టణంలోని నూర్ షావలి బాబా దర్గా ఉరుసు ఉత్సవాల నిర్వహణకు పూర్తిగా సహకరిస్తామని మున్సిపల్ ఛైర్మన్ ఎస్ అలీం బాషా అన్నారు. బుధవారం ఉదయం ఈ మేరకు నాన్న సాహెబ్ పేటలోని ప్రభుత్వ కళాశాల మైదానాన్ని ఆయన పరిశీలించారు. ఏటా కళాశాల మైదానం ఆవరణలో జరిగే ఉరుసు ఉత్సవాలకు మున్సిపల్ సిబ్బంది తగిన వ్యవస్థను కల్పిస్తున్నామని వివరించారు. కమిషనర్ మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో పారిశుద్ధ సిబ్బంది పరిశుభ్రత చర్యలు చేపట్టారు. శానిటరీ ఇన్స్పెక్టర్, ముని వెంకటప్ప, సెక్రటరీలు, శానిటరీ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## 10 ఫలితాల్లో మండలం టాప్ మల్లెల సుదర్శన్

సదుం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త



సదంలోని మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువు తున్న మల్లెల సుదర్శన్ బుధవారం విడుదలైన 10 పరీక్ష ఫలితాల్లో సదుం మండలంలోనే అత్యధిక మార్కులుతో ప్రథమ స్థానం నిలిచాడు. ఇతని స్వగ్రామం పాకాల మండలం చిన్న గోర్పాడు గ్రామం. అమ్మ నాన్న కూడా లేని నిరుపేద కుటుంబం 5వ తరగతి నుంచి సదుం గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. ఈ ఫలితాల పట్ల ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాల విద్యార్థులు 100 శాతం వచ్చిన సాధించగా పాలమందు జిల్లా పరిషత్ నుంచి పాఠశాల విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధించారు. అదే విధంగా బూరగమంద 83 శాతం చెరుకువారిపల్లె 52 శాతం విద్యార్థులు ఫలితాలు సాధించారని మండల విద్యాశాఖ అధికారి దామోదర తెలిపారు. అదే విధంగా సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 119 మంది విద్యార్థులకు నూరు మంది ఉత్తీర్ణులయ్యారు. 84 శాతం ఫలితాలు సాధించినట్లు ప్రధాన ఉపాధ్యాయులు జయకుమార్ రెడ్డి తెలిపారు. పాఠశాలలో కే జీవన్ వర్మ 565 మార్కులతో ప్రథమ స్థానం పొందగా, ఎం సైదు సాబ్ 562 మార్కులతో ద్వితీయ స్థానం పొందారు. అదే విధంగా సఫియా అంజు 527 మార్కులతో తృతీయ స్థానం పొందారు.

## పదవ తరగతి ఫలితాల్లో విజయం విద్యార్థుల ప్రతిభ

చిత్తూరురూరల్, ఏప్రిల్ 23ప్రభాతవార్త:



పదవతరగతి ఫలితాల్లో విజయం పాఠశాల విద్యార్థులు 94 శాతం ఉత్తీర్ణత సాధించారని విద్యా సంస్థల అధినేత డా.ఎం. తేజోమూర్తితెలిపారు. వరుణ్‌తేజ (590), షబ్నమ్(587), పవిత్ర (584) రిహాన్(584), మోహిత్‌రెడ్డి(582) మార్కులు సాధించారని పేర్కొన్నారు. అతితక్కువ మంది విద్యార్థులతో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి తమ పాఠశాల అధ్యాపక బృందం బోధనా పద్ధతులు, ఒత్తిడిలేని విద్యావిధానం కారణమని విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ డా.ఎం.శైలజామూర్తితెలిపారు. విద్యార్థులనుహెచ్ఎంశ్రీదేవి, అధ్యాపకబృందం అభినందించారు.

## పది పరీక్షల్లో బాలికలదే పైచేయి -మండల టాపర్‌గా లిఖిత

చౌడేపల్లి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



పది పరీక్షల్లో మండలంలో బాలికలదే పైచేయిగా నిలచింది. మండల వ్యాప్తంగా 9ఉన్నత పాఠశాలలు, ఒక ప్రైవేటు పాఠశాలున్నాయి. చింతమాకులపల్లి ఉన్నత పాఠశాల 81.82శాతం, చౌడేపల్లి 32శాతం, మేకలచిన్నేపల్లి 78.95శాతం, చారాల 62.86శాతం, పుదిపట్ల 67.16శాతం, పరికిదొన 68.42శాతం, ఎ.కొత్తకోట 82.76శాతం, కాటిపేరి 82.61శాతం, దాదేపల్లి 83.33శాతం, విజయవాణి 83.85శాతం ఫలితాలు సాధించాయి. ఎ.కొత్తకోట లిఖిత 580మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవగా, చౌడేపల్లి భవ్యశ్రీ 579, భువనేశ్వరి 579, పుదిపట్ల జస్మిత 577మార్కులు సాధించారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 392మంది బాలురు, 230మంది బాలికలు పది పరీక్షలు రాయగా బాలురు 49.49శాతం, బాలికలు 68శాతం ఉత్తీర్ణత సాధించారు. మండల ఉత్తీర్ణత 58.67శాతం వుండగా దాదేపల్లి అధికంగానూ, చౌడేపల్లి తక్కువ శాతం ఉత్తీర్ణతను సాధించాయి.

## టెన్త్ ఫలితాల్లో సిఎన్ఆర్ విద్యార్థులు విజయకేతనం



**గుడిపాల, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** గుడిపాల సిఎన్ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో విజయకేతనం ఎగురవేశారు. గత నెల నిర్వహించిన టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు సిఎం మనీషా(570) మార్కులు సాధించి మండల ప్రథమ స్థానం సాధించిందని పాఠశాల కరెస్పాండెంట్ లోకేష్ తెలిపారు. ద్వితీయ స్థానంలో శ్వేత(568), రోషిని(502) మార్కులు సాధించారన్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను వారికి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను కరెస్పాండెంట్ లోకేష్ అభినందించారు.

## శ్రీకాళహస్తి పట్టణంలో అత్యధికమార్కులు 'దస్కూల్'కు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త




శ్రీకాళహస్తి పట్టణంలో పది పరీక్షా ఫలితాలు విద్యార్థుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. పది పరీక్షల్లో 1167 మంది పరీక్షల్లో పాల్గొనగా 834 మ ంది పాస్ అయ్యారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని పేరెన్నిక గన్న మాజీ మున్సిపల్, శ్రీకాళహస్తీశ్వరాలయ ఛైర్మెన్ శాంతారాంజెపవార్ స్థాపించిన దస్కూల్ మొదటి స్థానం సాధించారు. ఈ పాఠశాల నుంచి హాజరైన 66 మంది హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 40మంది 500 మార్కులకు పైగా సాధించారు. ప్రైవేటు పాఠశాలలో టౌన్ టాపర్‌గా ఎం.దయాశంకర్ 595 మార్కులు సాధించి రికార్డు సాధించారు. కాగా టీ.మమత 591 మార్కులు సాధించారు. పి.గీర్వాన్ సాయి 588 మార్కులు రాగా కే.శ్రీనాథ్ 586 మార్కులు సాధించారు. డ.మోని 585 మార్కులతో రికార్డు సాధించారు. క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత ఫలితాలు సాధించామని పాఠశాల కరస్పాడెంట్ జనార్థన్‌పవార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.విశాలలు వివరించారు. కాగా 29 పాఠశాలలు, 4కార్పొరేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరుయ్యారు. ఇందులో మొదటి స్థానంలో భాష్యం పాఠశాల నిలిచింది, ఈ పాఠశాల నుంచి మాజరైన 597 మార్కులు సాధించిన చాతుర్య మొదటి స్థానంలో నిలిచారు. కాగా నారాయణ పాఠశాలకు చెందిన ప్రణతి 596 మార్కులు సాధించి ద్వితీయస్థానం సాధించారు. రత్నం పాఠశాలకు చెందిన 595 మార్కులు ఎన్ సాయి శ్రీ అనే విద్యార్థి సాధించారు. ప్రవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటారు.

# సినీ తారల చేతుల మీదుగా బ్రోచర్ విడుదల



వాకాడు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : వాకాడులోని శ్రేయ ఇన్ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో బుధవారం సినీ తారల చేతుల మీదగా నూతనంగా వేసిన లే అవుట్ బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సినీ ఇండస్ట్రీ ఆస్కార్ విన్నర్ ప్రముఖ రచయిత సింగర్ చంద్రబోస్ మాట్లాడుతూ శ్రేయ ఇన్ఫ్రా డెవలపర్స్ సిఎండి డాక్టర్ బాబు అగస్టీన్ తలపెట్టిన శ్రేయ రియల్ ఎస్టేట్ తాను అంబాసిడర్గా ఉన్నానని, ఆయన ఎక్కడ రియల్ ఎస్టేట్ వెంచర్ ఏసిన తాను వస్తానని, ముఖ్యంగా అగస్టీన్ నిబద్ధత, క్రమశిక్షణ పట్టుదల ఉన్న మంచి వ్యక్తి తో తాను ఆయన దగ్గర ఎంతో తెలుసుకున్నాను అన్నారు. ఆయన వేసే వెంచర్ ప్రభుత్వ అనుమతులతో వేస్తారని అన్నారు. వెంచర్ ఒక మోడల్గా ఉంటుందన్నారు. ప్రముఖ హీరోయిన్ ప్రియ హెగ్డే మాట్లాడుతూ శ్రేయ ఇన్ఫ్రా డెవలపర్స్ సిఎండి బాబు ఆగస్టిన్ వేసే ప్రతి అడుగు పర్ఫెక్ట్గా ఉంటుందని, వెంచర్ మోడల్గా అన్ని విధాల అందంగా సుందరవదనంగా తీర్చిదిద్దుతాడని ప్రతి ఒక్కరు భూమి మీద దృష్టి పెట్టాలని ఆమె కోరారు. రాబోవు రోజుల్లో భూమికి అధిక ప్రాధాన్యత ఎప్పుడూ ఉంటుందని, ఈ ప్రాంతంలో ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు. తాను ఈ ప్రాంతం గురించి సర్వే చేయగా శ్రేయ రియల్ ఎస్టేట్ నాలుగు దిక్కుల ప్రభుత్వ శాఖలు ఉన్నాయని, కొద్ది దూరంలో బంగాళాఖాతం సముద్రం ఉందని, అదే ప్రాంతంలో బీచ్ త్వరలో నిర్మాణం జరుగుతుందని, అదే విధంగా దుగరాజపట్నం గ్రామంలోని రానున్న రోజుల్లో ఫోర్ట్ వస్తుందని ఈ ప్రాంతం ఒక మైలురాయిగా నిలిచిపోతుందని హీరోయిన్ ప్రియా హగ్డే తెలిపారు. శ్రేయ సీఎండి డాక్టర్ బాబు అగస్టిన్ మాట్లాడుతూ శ్రేయ సంస్థలో ఒకటైన వాకాడు వెంచర్ అద్భుతం అని 23 తేదీ నుండి 24 తేదీ వరకు ఒక అంకణంకి 5000 రూపాయలు డిస్కౌంట్ ఉంటుందని, స్థలం బుక్ చేస్తున్న వారికి ఆయన సూచించారు. ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందడంతో పాటు ఇంత గ్రాండ్గా, విజయవంతంగా ఈవెంట్ కార్యక్రమం జరగడం ఆనందంగా ఉందన్నారు, ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు ఉన్నట్టే ప్రతి ఒక్కరు సొంతంగా ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ ప్రియాంక జైన్, శ్రేయ ప్రతినిధులు బాలకృష్ణా రెడ్డి, వెంకటేశ్వర్రెడ్డి, ఎల్.సి.రమణారెడ్డి, స్థానిక నాయకులు, శ్రేయ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## పది పరీక్షా ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ



గూడూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : పదవ తరగతి పరీక్షా ఫలితాలలో శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు సాయి వైశాలి అనే విద్యార్థి 598 మార్కులతో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలువగా రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకోగా, పుష్పక్ చౌదరి 596 మార్కులు, జోషిత 595 మార్కులు సాధించి డివిజన్ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ మరియు రీజనల్ ఇన్చార్జ్ అయినటువంటి కోటా శ్రీనివాసులు తెలియజేశారు. అంతేకాకుండా 590కి పైగా అత్యధిక సంఖ్యలో విద్యార్థులు మార్కులు సంపాదించినట్లు తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ కోటా శ్రీనివాసులు, శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం ఎన్ శ్రీకాంత్, నెల్లూరు జోన్ రీజనల్ ఇంచార్జ్ వినయ్ కుమార్,మరియు అకాడమిక్ కోఆర్డినేటర్స్ భాషా, నాగరాజు, వెంకటేశ్వర్లు పాఠశాలలో విద్యార్థులను సన్మానించి అభినందించడం జరిగింది. అదేవిధంగా రెండో పట్టణంలో ఉన్న వి ఎస్ ఆర్ స్కూల్ నందు 590 మార్కులు సాధించిన ఎం తేజస్విని 587 మార్కులు జీవీఎస్ యువతేజ కె భాష్మత,584 మార్కులు పి.మృదుల పి.కార్తీక్ సాధించారు. 550 మార్కులు 22 మంది విద్యార్థులకి రావడం సంతోషదాయకమన్నారు. అదే విధంగా నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఆర్ కైయాతి (592), ఎం. జ్ఞానంద (591), రితేష్ (588) మార్కులు సాధించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బాలకృష్ణ రాజు, కరస్పాండెంట్ అన్నపూర్ణమ్మ ,పాఠశాల డీన్లు శ్రీహరిబాబు, హరి బ్రహ్మ యాదవ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు



గూడూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : రూరల్ పరిధిలోని చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాల నల్లగర్ల రమ్యశ్రీ గూడూరు భవ్య శ్రీ మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. రమ్యశ్రీకి 572 గూడూరు భవ్యశ్రీ కి 570 మార్కులు వచ్చాయి. దీంతో ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులు కుటుంబ సభ్యులు విద్యార్థులను అభినందించారు. మండలంలో 63.43 శాతం ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా సిఎస్ మున్సిపల్ హైస్కూల్లో అజయ్ కుమార్ 560, అయ్యవారిపాలెం జడ్పీ హైస్కూల్లో కె శ్రీవల్లి 544 జడ్పీ బాయ్స్ మరియు బాలికల స్కూల్ గూడూరు పి.మోనిక 564 జి సాయి వెంకట్ 541 మార్కులు దీపాలం హైస్కూల్ వి.మోహన్ 535 విందూరు హైస్కూల్ సి.వెంకట్ జ్యోతిష్ణ 569 జిఎస్ఆర్ ఎం.మున్సిపల్ హైస్కూల్లో ఏ పవిత్ర 536 కొండగుంట జడ్పీ హైస్కూల్ పి పల్లవి 449 జడ్పీ హైస్కూల్ చెన్నూరు జి.గోవిందు 553 జడ్పీ హైస్కూల్ నెల్లూరు పి.అశోక్ 554 మార్కులు రావడం జరిగింది. వీరిని ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు అభినందించారు.

## పది పరీక్షా ఫలితాల్లో లిటిల్ ఏంజెల్స్ ప్రభంజనం



గూడూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : పదో తరగతి ఫలితాలలో లిటిల్ ఏంజెల్స్ ప్రభంజనం సృష్టించింది 595 మార్కులతో ఏ పూజిత స్కూల్ టాపర్గా నిలిచారు. 587 మార్కులతో కే కృష్ణవేణి 580 మార్కులతో కే నరసింహులు ఉత్తమ ఫలితాలు సాధించారు పరీక్షకు హాజరైన 59 మంది విద్యార్థులలో 41 మంది 500 పైన మార్పులు సాధించడం విశేషం పరీక్ష రాసిన అందరూ విద్యార్థులు ఉత్తీర్ణులై 100 ఫలితాలు సాధించడం ఈ పాఠశాలకు విద్యార్థుల పట్ల అంకితభావాన్ని తెలియజేస్తుంది. ఈ అభినందన కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ సురేష్ ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్వకేంద్ర విద్యార్థుల ప్రభంజనం



నాయుడుపేట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదొతరగతి పరీక్ష పలితాల్లో విద్వకేంద్ర విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాదించి నాయుడుపేటలో టౌన్ఫస్ట్గా ప్రభంజనం సృష్టించారు. ఈసందర్భంగా విద్వకేంద్ర పాఠశాల డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి మాట్లడుతూ మాపాఠశాల విద్యార్థుల్లో టి.వెంకటాద్రి 593 మార్కులతో మొదటిస్థానం సాదించగా ఎం నవీన్కుమార్ 592 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచాడు.ఉత్తమ పలితాలు సాదించిన విద్యార్థులకు నగదు ప్రోత్సహక బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## నవభారతి విద్యార్థులు విజయభేరి

నాయుడుపేట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష పలితాల్లో నాయుడుపేట పట్టణంలోని నవభారతి విద్యార్థులు ఉత్తమ పలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్రెడ్డి తెలిపారు. విద్యార్థుల్లో కె.మోక్షిత 591మార్కులు సాధించి నాయుడుపేటలో రికార్డు సృష్టించామన్నారు. అదేవిధంగా రిషికారాజ్ 586 మార్కులతో విజయభేరి మోగించామని తెలిపారు.

## ఉగ్రవాది దాడుల అప్రమత్తమైన పోలీసులు : డి.ఎస్

వెంకటగిరి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో వెంకటగిరిలో డిఎస్పి పి.గీత విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వెంకటగిరి పట్టణంలోని అన్ని వీధిలో తిరిగి నంబర్లు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. నంబర్లు లేకుండా ఉన్న వాహనాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని డి.ఎస్.పి సీఐ ఏవి రమణ, ఎస్ఐ సుబ్బారావు ఆదేశించారు. సీసీ కెమెరాలను నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ఉగ్రవాదుల దాడులు నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పట్టణంలోనే తూర్పు వీధి, రాజు వీధి, ఉత్తరం దక్షిణ వీధుల్లో ఆమె తనిఖీలు నిర్వహించారు. ఫోటో

## కార్పొరేషన్ రుణాలకు ఆన్లైన్ దరఖాస్తుకు ఆహ్వానం

బాలాయపల్లి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : మండలంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల కొరకు ఆన్లైన్ నందు దరఖాస్తులు నమోదు చేసుకోవచ్చని ఎంపీడీవో డీజే.వినీల్ కుమార్ పేర్కొన్నారు. వివిధ పథకాలకు సంబంధించి షెడ్యూల్డ్ కులానికి చెందిన వారు ఏపి-ఓబిఎంఎంఎస్ పోర్టల్లో మే నెల పదోతేదీ లోగా నమోదు చేసుకోవాలని స్పష్టం చేసారు. అర్హతలు ఉన్న అభ్యర్థులు వారి సంబందిత ధృవీకరణ పత్రములతో దరఖాస్తులు నమోదు చేసుకొనుటకు గ్రామ సచివాలయాలు గాని, మీసేవా లేదా ఇంటర్నెట్ కేంద్రాలలో లేదా సొంతంగానైనా ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

## మర్రిగుంట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**-46 మందికి గాయాలు-నలుగురు పరిస్థితి విషమం**



రేణిగుంట, ఏప్రిల్ 23ప్రభాతవార్త : రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని మర్రిగుంట జంక్షన్ వద్ద ఫాక్స్ లింక్ కంపెనీకి యోగానంద కాలేజీ హాస్టల్ నుండి మహిళా కార్మికులను తరలిస్తున్న బస్సు ట్రాక్టర్ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 46 మంది మహిళా కార్మికులు గాయపడ్డారు. వీరిలో పదిమంది తీవ్రంగా గాయపడగా మరో నలుగురు పరిస్థితి విషమంగా ఉంది. బస్సు డ్రైవర్ వేగంగా బస్సు నడపడం వల్లే బస్సు బోల్తా పడిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాస్, రూరల్ సీఐ మురళీకృష్ణ, గాజులమన్డ్యు ఎస్సై సుధాకర్ సంఘటన స్థలం చేరుకొని క్షతగాత్రులను హుటాహుటిన 108 తదితర అంబులెన్స్ లో అమర ఆసుపత్రికి తరలించారు. అమర ఆసుపత్రి ట్రామా బృందం చైర్మన్ వరప్రసాద్ గౌరినేని, మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి గౌరినేని పరివేక్షణలో అత్యవసర చికిత్సలు చేశారు.

## విద్యార్థులక ల్యాబ్ ట్యాబ్లు పంపిణీ



తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదివి నేడు వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అభినందించి ట్యాబ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదవి మంచి మార్కులు సాధించేలా విద్యార్థుల వెన్నంటే ఉండి కృషి చేసిన విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లాలో బుధవారం వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలకు చెందిన కె.ఇంద్రజ (594/600) దక్కిలి మండలం, చావలపల్లి మున్సిపల్ హైస్కూల్, ఎం. సెవిత (591/600) జెడ్పీ హైస్కూల్ కోటకాడపల్లి ఎర్రవారి పాలెం మండలం, ఎ.వందన (589/600) జెడ్పీ హైస్కూల్, మైనకురు, నాయుడుపేట మండలం, ఎ.కేతన్ (589/600) మున్సిపల్ హైస్కూల్ ఆగ్రహారం పల్లి విద్యార్థులకు ల్యాబ్ ట్యాప్లు అందజేశారు.

## మాతృభాషను ప్రోత్సహించడం హర్షణీయం : కడ పి.డి.



శాంతిపురం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:విద్యార్థులను మాతృభాష పట్ల ప్రోత్సహించడం హర్షణీయమని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం శెట్టిపల్లి స్కూల్లో హెచ్ఎం తీగల వెంకటయ్య చేపట్టిన మాతృభాష వస్తే మరెన్ని భాషలైనా నేర్చవచ్చు ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. మాతృభాషలోని కేవలం 26 సరళ పదాల ఆధారంగా కన్నడ, తమిళం, మళ యాళం భాషలు చదవడం, రాయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ గంగులప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టెన్త్లో ఉత్తమ మార్కులు పొందిన కిషోర్ అనే విద్యార్థిని పిడి అభినందించారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు



బాలాయపల్లి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : 215 మందికి 151 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ కిల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. నిడిగల్లు జడ్పీ పాఠశాల టి.హరిణి 574,బాలాయపల్లి544, కె.అరుణ్ కుమార్రెడ్డి, 544, కె.అరుణ్ కుమార్రెడ్డి, ఆర్.లోకి 523 మార్కులు సాధించారని ఆయన వివరించారు. నిడిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న హర్షిని 574 మార్కులు సాధించి మండలంలో రికార్డు సృష్టించినట్లు హెచ్ ఎం మహేష్ తెలిపారు. సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఓ.విజయశ్రీ 463 మార్కులు సాధించారు, 13 మందికి 11మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఏ.ఎస్.డబ్ల్యూ. లక్ష్మి రాజ్యం తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను హెచ్. ఎంలు, మేట్రిన్ చెంచులక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

## పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు



వెంకటగిరి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శ్రీ చైతన్య, నారా యణ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతి భను చాటారు. శ్రీ చైతన్యకు చెందిన వేముల గాయత్రి 595, బిల్లా విగ్నేష్ 594 మార్కులు సాధించారు. నారాయణ పాఠశాలకు చెందిన ధనుశ్రీ 594, లహరికృష్ణ 591 మార్కులు సాధించారు. మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 80.64 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు ఎంఈఓ తోట వెంకటేశ్వర్లు తెలిపారు. 1095 మంది పరీక్షలకు హాజరు కాగా 883 ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల చెందిన విద్యార్థి595, నారాయణ 594, ఏపీ ఆర్ ఎస్ బాలికల పాఠశాల విద్యార్థినికి 594 మార్కులు సాధించారు ఆయన వివరించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు సిబ్బంది తల్లిదండ్రులు అభినందించారు.

## సేవలు ప్రజలకి సులభతరంగా ఉండాలి : ఎంపీడీవో



వాకాడు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త: ప్రభుత్వ కార్యాలయంలోని, సచివాలయం లోని ప్రభుత్వ సేవలు ప్రజలకి సులభతరంగా ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండల పరిధిలోని నెల్లిపూడి, వాకాడు 2 సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాలలో జరుగుతున్న సర్వేలను గురించి ఎంపీడీవో శ్రీనివాసులు సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకు న్నారు. మన మిత్ర సర్వేని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమాన్ని త్వరితగతంగా పనిచేయాలని అన్నారు.

## పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలే మిన్న



తడ, ఏప్రిల్ 23 ప్రభాతవార్త: బుధవారం విడుదలైన 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు సత్తా చాటారు. మండల పరిధిలో కెజిబివి ఏపీ మోడల్ స్కూళ్ల కన్నా ప్రభుత్వ పాఠశాలలే మంచి ఫలితాలు సాధించడం విశేషం. తడలోని బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న టి.వర్షిణి 567 మార్కులతో మండలంలోనే ప్రథమ స్థానం సాధించింది. ఆమెను ఎంఇఓ మల్లికార్జునరావు ఘనంగా సన్మానించారు. అదే ఉన్నత పాఠశాలలో పి.మేఘనకి 565 మార్కులు, చినమాంబట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన ఎన్.వర్షితకు 565 మార్కులు వచ్చాయి. మొత్తంమీద తడ బాలికల ఉన్నత పాఠశాలలో 91 శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు. మండల పరిధిలోని మోడల్ స్కూల్లో చదువుతున్న విద్యార్థులు 78 శాతం, కెజిబివి విద్యార్థినులు 69 శాతం ఉత్తీర్ణులయ్యారు. రామాపురం జిల్లా పరిషత్ స్కూల్లో చదివిన వారు 75 శాతం, వాటంబేడులో 42 శాతం, జిల్లా పరిషత్ తడ బాలుర ఉన్నత పాఠశాలలో 41 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు అధికారులు తెలిపారు. మండలం మొత్తంమీద 67 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఇఓ తెలిపారు. ఉత్తీర్ణులైన వారిని మండల విద్యాశాఖ సిబ్బంది అభినందించారు.

## వేనాడు, బివిపాలెం పాఠశాలలను యథాస్థితిగా ఉంచండి



తడ, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : మండలంలోని వేనాడు దీవి, పులికాట్ సరస్సు ఒడ్డున ఉన్న భీములవారిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలను యథాస్థితిగా ఉంచాలని తడ మండల ఎపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం కోరుతోంది. ఈ మేరకు వారు జిల్లా ఉన్నతాధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని కలిసి వినతిపత్రం అంద జేశారు. వేనాడులో మళ్లీ ప్రాథమిక పాఠశాలగా మారిస్తే అక్కడికి దూరంగా ఉన్న సూళ్లూరుపేటకు 20 కిలోమీటర్లు ప్రయాణించి పాఠశాలలో చేరాల్సి ఉందని వారు చెప్పారు. బివిపాలెంలో ప్రాథమికోన్నత పాఠశాల ఇరకం వంటి దీవులకు కూడా అందుబాటులో ఉందని, దాన్ని కూడా యథాస్థితిగా ఉంచాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఈ సమస్యలు విని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉస్మాన్బాషా, రమణయ్య, సుధాకర్రెడ్డి, రఘురామయ్య, గంగాధర్, గిరి, ప్రధానోపాధ్యాయులు మమత, మాలకొండయ్య పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల పిరికిపంద చర్యను




గూడూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త: పాకిస్తాన్ ఉగ్రవాదుల పిరికిపంద చర్యను తీవ్రంగా ఖండిస్తు న్నామని బిజేవైఎం అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్ కుమార్ పేర్కొన్నారు. భారతీయ జనతా యువ మోర్చా బీజేవైఎం గూడూరు ఆధ్వర్యంలో స్థానిక గూడూరు పట్టణంలోని శ్రీ వివేకానంద కోచింగ్ సెంటర్ వద్ద నిన్న జమ్మూ అండ్ కాశ్మీర్ లో పహల్గామ్ ఉగ్ర దాడిలో ప్రాణాలు వదిలిన 27 మంది అమాయక హిందువులకు ఘన నివాళి అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నగర అధ్యక్షులు శివశంకర్, ప్రదీప్, నవీన్, కిరణ్, ప్రసాద్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దాడి సంఘటనపై చర్యలు తీసుకోవాలి



గూడూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : విశాఖపట్నం దువ్వాడ రఘు కాలేజీలో ఉపాధ్యాయునిపై జరిగిన దాడి సంఘటనపై విద్యాశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గూడూరు ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ నాయకులు సబ్ కలెక్టర్కు వినతి పత్రం అందజేసారు. విశాఖపట్నం జిల్లా దువ్వాడ ప్రాంగణంలో ఉన్న రఘు ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సంఘటనను గూడూరులోని ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా గౌరవ సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా గారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీల్ రాజ్, హరికృష్ణ, దయాకర్, మహేష్ పాల్గొన్నారు.

## చిల్లకూరులో 85 శాతం ఉత్తీర్ణత



చిల్లకూరు,ఏప్రిల్ 23 ప్రభాతవార్త : మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదివిన పదవ తరగతి విద్యార్థులు పరీక్షల్లో 85 శాతంఉత్తీర్ణత సాధించారు. 9 పాఠశాల నుంచి 407 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 341 మంది విద్యార్థులు పాసయ్యారు. వారిలో నేలపల్లి రెట్టపల్లి జడ్పీ హైస్కూల్లో మేకల శేఖర్ 584 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమంగా నిలిచారు. అదే విధంగా వరంగల్ జడ్పీ హైస్కూల్ నుండి పురుషోత్తం 573 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచారు. చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో కన్నా సాయికుమార్ 566 మార్కులతో మూడో స్థానంలో నిలిచారు. చిల్లకూరులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి చరణ్ తేజ 574 మార్కులు టాపర్గా నిలిచారు.

## ఉగ్రవాదులను శిక్షించాలని పాత్రికేయుల డిమాండ్



చిత్తూరుటౌన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : కాశ్మీర్లో భారతీయులను కాల్చి చంపిన ఉగ్రవాదులను అరెస్టు చేసి చట్టం ముందు నిలబెట్టాలని చిత్తూరు పాత్రికేయులు డిమాండ్ చేశారు. కాశ్మీర్లో జరిగిన ఉగ్రవాద చర్యలను ఖండిస్తూ బుధవారం చిత్తూరు ప్రెస్ క్లబ్, ఏపీయుడబ్ల్యూజేల సంయుక్త ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రమేష్,కాళేశ్వర్ రెడ్డి, ఏపీయుడబ్ల్యూజె జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు లోకనాథన్, మురళీకృష్ణలు మాట్లాడుతూ కాశ్మీర్లో ప్రకృతిని ఆస్వాదించడానికి వెళ్ళిన భారతీయులపై ఉగ్రమూకలు దాడి చేసి కాల్చి చంపడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా సంయుక్త కార్యదర్శి ఇశార్ ,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అశోక్ కుమార్, చిత్తూరు ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పవన్ ,శివ కార్యవర్గ సభ్యులు శివ, చంద్ర,అయ్యప్ప రాజేష్, సీనియర్ జర్నలిస్టులు హేమంత్ కుమార్, హరీష్, వీరరాఘవులు, అప్పు, గంగాధర నెల్లూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తిరుమలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కృషి విజ్ఞాన కేంద్రం సేవలు అభినందనీయం



రేణిగుంట ఏప్రిల్ 23 ప్రభాతవార్త : రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చైతన్య పురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు వివిధ వర్గాల ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమనీ భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి వ్యవసాయ విస్తరణ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, డా.రాజ్బీర్ సింగ్ అన్నారు. అధికార పర్యటనలో భాగంగా బుధవారం తిరుపతిలోని రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. రాస్ ప్రధాన కార్యదర్శి డా.ఎస్. వెంకటరత్నం వివిధ వర్గాలకు రాస్ అందిస్తున్న సేవలను ఫోటో ప్రదర్శన ద్వారా వివరించారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డా. ఎస్. శ్రీనివాసులు రాస్ అనుబంధంగా కృషి విజ్ఞాన కేంద్రం గత 32 సంవత్సరాలుగా జిల్లాలోని రైతులు, రైతు మహిళలు, గ్రామీణ యువత, విస్తరణ అధికారులకు నూతన వ్యవసాయ సాంకేతికతపై నిర్వహిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. డా.రాజ్బీర్ సింగ్ కృషి విజ్ఞాన కేంద్రం చిరు ధాన్యాలతో తయారు చేసిన ఐదు రకాల విలువ ఆధారిత ఉత్పత్తులనును ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాస్ ప్రధాన కార్యదర్శి డా. ఎస్. వెంకటరత్నం, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డా. ఎస్. శ్రీనివాసులు, కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక డంపింగ్

**- ఒక ట్రాక్టర్ లోడ్ రూ.3 నుండి రూ.5 వేలకు విక్రయం**



పాలసముద్రం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త: పాలసముద్రం మండలం వనదుర్గాపురం గ్రామ పరిధిలో గత రెండు నెలలుగా ఇసుక అక్రమ డంపింగ్ యదేచ్ఛగా సాగుతుంది. స్థానిక నిరుపేద ప్రజలకు నిర్మాణాలు చేపట్టడానికి ఇసుక అందుబాటులో లేకపోవడం, ఇక్కడ డంప్ చేసిన ఇసుక అక్రమంగా ఇతర రాష్ట్రాలకు యదేచ్ఛగా తరలిస్తుండటంతో ఇసుక కొరతతో ప్రజానీకం అల్లాడుతోంది. ఇసుక అక్రమ డంపింగ్పై ఇటు రెవెన్యూ, అటు పోలీసు శాఖ పట్టించుకోకపోవడంతో ఇసుకను వాణిజ్యపర అమ్మకాల కోసం అక్రమార్కులు అర్రులు చాస్తున్నారు. నిర్మాణాల కోసం ఇసుక అవసరమైన పేద ప్రజానీకం ఒక ట్రాక్టరు ఇసుక కోసం 3వేల రూపాయల నుండి 5వేల రూపాయలు చెల్లించా ల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పంచాయతీ కార్యదర్శి ఇసుక అక్రమ డంపింగ్పై ప్రశ్నించడంతో అతను అధికార పార్టీ నేతలకు ప్రస్తుతం టార్గెట్ అయ్యారని ఇదే పరిస్థితి ఇతరులకు వుంటుందని వారు హెచ్చరిస్తున్నారని స్థానికులు చెప్తున్నారు. ఈ విషయంపై ప్రభుత్వ విప్, నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వివిఎం థామస్, కలెక్టర్, ఎస్పీలు స్పందించి తగు చర్యలు తీసుకొని సామాన్యులకు ఇసుక అందుబాటులో వుండేలా చర్యలు తీసకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## అపోలో యూరో లేజర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**-పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్**



తవణంపల్లె, ఏ ప్రిల్ 23 ప్రభాతవార్త: అరగొండ అపోలో ఆస ్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన యూరో లేజర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. అరగొండ అపోలో ఆస్పత్రిలో మూత్రపిండాల్లోని రాళ్ళను తొలగించేందుకు అధు నాతనంగా ఏర్పాటు చేసిన యూరో లేజర్ సేవలను ఎమ్మెల్యే మురళీమోహన్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన అపోలో జనరల్ మేనేజర్ డాక్టర్ వినోద్, ఆస్పత్రి ఆడ్మినిస్ట్రేటర్ చంద్రశేఖర్రెడ్డి, ప్రముఖ యూరో సర్జన్ డాక్టర్ శంకర్, ఆస్పత్రి వైద్యులతో కలసి విలేకరులతో మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా గ్రామీణ ప్రాంతంలోని అరగొండ అపోలో ఆస్పత్రిలో అపోలో ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో మొట్టమొదటిగా యూరో లేజర్ సర్జరీ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషించదగ్గ విషయమన్నారు. జిల్లాలో మూత్రపిండాల్లో రాళ్ళు తీస్తామంటూ కొంత మంది చిట్కా వైద్యుల చేతుల్లో ప్రజలు మోసపోతూ ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. జనరల్ మేనేజర్ డాక్టర్ వినోద్ మాట్లాడుతూ యూరప్, అమెరికా వంటి దేశాల్లో అందుబాటులో వుండే యూరో లేజర్ సేవలను జిల్లాలో మొట్టమొదటి సారిగా అరగొండ అపోలో ఆస్పత్రిలో బుధవారం ప్రారంభించి మొదటి రోజే విజయవంతంగా 10 ఆపరేషన్లను నిర్వహించినట్లు తెలిపారు. ఈసేవలను కేవలం సేవా దృక్పదంతో అతి తక్కువ ఖర్చుతో నిర్వహించేందుకు అపోలో ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి స్వగ్రామం అరగొండలో నూతనంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే మరో రెండునెలల్లో అన్ని రకాల సర్జరీలను అధునాతన లేజర్ పద్ధతిలో నిర్వహించ దానికి చర్యలు తీసుకుంటున్నట్లు డాక్టర్ వినోద్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరెంటెంట్ డాక్టర్ శ్రీధర్, ఏఓ చంద్రశేఖర్రెడ్డి, వైద్యులు జ్యోత్స్న, రేష్మ, పీఆర్ఓ కమృద్దీన్, బంగారుపాళ్యం ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్ నాయుడు, మండల టీడీపీ నాయకులు దిలీప్,వెంకటేశ్వర చౌదరి, రఘు, గోపియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ గ్రావెల్ తోలకం ఆపండి : సీపీఎం



సత్యవేడు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త: సత్యవేడు మండలం చెన్నేరి యానాదుల భూముల్లో గ్రావెల్ పాలకాలు ఆపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జనార్ధన్, సత్యవేడు ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్లు డిమాండ్ చేశారు. బుధవారం చెన్నేరి యానాదికాలనీలోని బాధితులతో కలసి తహసీల్దార్ కార్యాల యంలో పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్లకు గ్రావెల్ క్వారీ యజమా నులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నేరి రెవెన్యూ సర్వే నెం.86,87లో ప్రభుత్వం యానాదులకు దళితులకు 2004లో డీకేటీ పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. కడప జిల్లాకు చెందిన సుధాకర్రాజు చెన్నేరిలో గ్రావెల్ తోలకాలకు వేరే సర్వే నంబర్లలో అనుమతి తీసుకుని యానాదులు, దళితులు భూముల్లో అక్రమంగా ప్రవేశించి గ్రావెల్ తోలుతుండగా యానాదులు అడ్డుకున్నారని తెలిపారు. క్వారీ యాజమాన్యం నిబంధనలను పక్కనపెట్టి తమ ఇష్టారాజ్యంగా ఎక్కు లోతులో తవ్వుతూ బావులను తలపించే విధంగా ఉన్నాయని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి అక్రమంగా గ్రావెల్ తోలుతున్న యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు కృష్ణయ్య, చిన్నారి, యానాదులు తదితరులు పాల్గొన్నారు.